క్లుప్తంగా

వెలుగు ఏపీఎంగా దుర్గ

అంబాజీపేట: వెలుగు కార్యాలయ ఏపీఎంగా ఎం.దుర్గా ఉద్యోగ బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. అయినవిల్లి మండల ఏపీఎంగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఆర్‌డీ వి.గంగాధర్‌రావు ఆత్రేయపురం బదిలీపై వెళ్లారు.

బేతాళునికి వెండి శఠగోపం, పళ్లెం సమర్పణ



అంబాజీపేటలో బేతాళునికి బహూకరించిన వెండి శఠగోపం, పళ్లెం

అంబాజీపేట: స్థానిక శ్రీనివాసనగర్‌లో ఉన్న విజయ బేతాళ స్వామి వారికి దాతలు కుడుపూడి రామ్మోహనరావు అనంతలక్ష్మి దంపతుల కుమారుడు నాగవిజయరాజ, స్వర్ణలత దంపతులు వెండి శఠగోపం, వెండి పళ్లెంను శుక్రవారం సమర్పించారు. సుమారు రూ.60 వేలు విలువ చేసే వెండి వస్తువులను ఆలయ కమిటీకి అందజేశారు. అంతకు ముందు బేతాళునికి ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ముక్తేశ్వరం విద్యార్థి ఎంపిక

అయినవిల్లి: అమలాపురం జిల్లా స్థాయిలో పీఎం శ్రీ పేరిట విద్యా వైభవ్ పోటీలు ఇటీవల జరిగాయి. ఈ పోటీల్లో భాగంగా జరిగిన 'మంథన్ మండల' పోటీలలో ముక్తేశ్వరం ఉన్నత పాఠశాల విద్యార్థి మానేపల్లి సాయి ఆశ్రిత ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికైంది. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమల కుమారి చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెడల్ అందజేశారు. ఆశ్రితను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఈవోపీఆర్డీగా భీమారావు

అంబాజీపేట: మండల ఈవోపీఆర్డీగా జి.భీమారావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించినట్టు ఎంపీడీవో జి.సరోవర్ తెలిపారు. రాజోలులో మండలంలో ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారన్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన బి.మమత కాట్రేనికోన బదిలీపై వెళ్లారని తెలిపారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులను అధికారులను సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

నేడు గ్రామాల్లో పల్లె పండుగ

అంబాజీపేట: పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎనిమిది గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. పసుపల్లి, వక్కలంక, ముక్కామల, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, మొసలపల్లి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాలకు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హాజరవుతారన్నారు.

22 నుంచి మొబైల్ ఆధార్ శిబిరాలు

మామిడికుదురు: మామిడికుదురు మండల పరిధిలో ఈ నెల 22వ తేదీ నుంచి మొబైల్ ఆధార శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. 22న పాశర్లపూడి-1, 23న గెద్దాడ, 24న పెదపట్నంలంక-1, ఆదుర్రు, 25న మామిడికుదురు-1, బి.దొడ్డవరం, 26న పెదపట్నం, ఈదరాడ గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరాలు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగతాయన్నారు. ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు సూచించారు.

వైభవంగా పడిపూజ



వాడపాలెం అయ్యప్పస్వామి ఆలయంలో కలశపూజ చేస్తున్న మధు నంబూద్రి గురుస్వామి

కొత్తపేట: వాడపాలెం అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం రాత్రి మహా పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మండల మాలధారణను పురస్కరించుకుని ఆలయ ఇన్‌చార్జి మట్టా బాబ్జి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు దొంతికుర్తి రామచంద్రశర్మ పర్యవేక్షణలో ఉదయం నుంచీ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. రాత్రి అయ్యప్ప స్వాములు స్వామివారికి పడిపూజను చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప సంకీర్తన చేసిన మట్టపర్తి చంద్రశేఖర్‌ను కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

గొయ్యి చిన్నదే కానీ.. ప్రమాదమే..

- ఆర్‌అండ్‌బీ రోడ్డు మధ్యలో కూలిన శ్లాబ్ కల్వర్టు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



మొగలికుదురులో కిందకు దిగిపోయిన శ్లాబ్ కల్వర్టు

మామిడికుదురు: మొగలికుదురు గ్రామంలోని ఆర్ అండ్ బీ రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరింది. కల్వర్టు శ్లాబ్ కూలిపోయింది. దీంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. చూడడానికి గొయ్యి చిన్నగా ఉండొచ్చు.. కానీ ప్రమాదం మాత్రం పెద్దగానే జరుగుతుంది. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

భారీ వాహనాల రాకపోకలతో..

తాటిపాక ఛానల్ నుంచి గెద్దాడ పంట కాలువకు సాగునీరు అందించే ప్రాంతంలో శ్లాబ్ కల్వర్టు దిగబడిపోవడంతో ఇక్కడ ప్రమాదకర పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. 216వ నెంబర్ జాతీయ రహదారి బైపాస్‌కు ఈ మార్గంలోనే వెళ్లాల్సి ఉంది. శివకోడు నుంచి పాశర్లపూడి వరకూ చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. కేవలం మొగలికుదురు-గెద్దాడ సరిహద్దు వరకు మాత్రమే బైపాస్ రోడ్డు పూర్తయింది. దీంతో బైపాస్ రోడ్డు మీదుగా వచ్చే భారీ వాహనాలు మొగలికుదురు-గెద్దాడ సరిహద్దు వరకూ వచ్చి ఇక్కడ నుంచి శ్లాబ్ కల్వర్టు ప్రాంతం మీదుగా తాటిపాక సెంటర్‌కు వస్తున్నాయి. భారీ వాహనాల రాకపోకలకు శ్లాబ్ కల్వర్టు కూలిపోయింది. ఇక్కడ ప్రమాదకర పరిస్థితిని వివరిస్తూ దిగబడిపోయిన ప్రాంతంలో రెండు కర్రలు పెట్టి ఎర్ర జెండాలు కట్టారు. కానీ రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి జరిగినా.. తప్పని ఇబ్బంది

తాటిపాక సెంటర్ నుంచి మొగలికుదురు మీదుగా ఆర్ అండ్ బీ రోడ్డు పూర్తి స్థాయిలో ఆధునికీకరణకు నోచుకుంది. రోడ్డును సువిశాలంగా వెడల్పు చేశారు. కానీ శ్లాబ్ కల్వర్టు మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. కల్వర్టుకు ఇరువైపులా రోడ్డు వెడల్పుగా ఉన్నా కల్వర్టు మాత్రం ఇరుకుగానే ఉంది. దీంతో ఇక్కడ వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. పాడైపోయిన శ్లాబ్ కల్వర్టును పునర్నిర్మించాలని స్థానికులు ఎంతో కాలం నుంచి డిమాండ్ చేస్తున్నా ఆ దిశగా చేపట్టిన చర్యలు శూన్యం. ఇప్పటికైనా దీని అభివృద్ధిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

తాత్కాలిక మరమ్మతులు చేపడతాం

దీనిపై ఆర్ అండ్ బీ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా శ్లాబ్ కల్వర్టు దిగబడిపోయిన ప్రాంతంలో తాత్కాలిక మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. దీని పునర్నిర్మాణం కోసం రూ.35 లక్షలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని చెప్పారు.

భయం భయంగా..



శ్లాబ్ కల్వర్టు దిగబడి పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యలో కల్వర్టు దిగబడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనదారులు భయం, భయంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిని పునర్నిర్మించే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– మెండా శ్రీను, మొగలికుదురు

స్థానికులు చెప్పినా..



మొగలికుదురు ప్రధాన రహదారిపై శ్లాబ్ కల్వర్టు కృంగిపోయింది. ఈ కల్వర్టు శిథిలస్థితికి చేరి ఏళ్లు గడచింది. దీనిని అభివృద్ధి చేయాలని స్థానికులు ఎంతో కాలం నుంచి చెప్పినా పరిష్కారం కాలేదు. దీనిపై అధికారులు తక్షణం స్పందించి దీనిని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలి. శ్లాబ్ కల్వర్టుకు మరమ్మతులు నిర్వహించాలి, దాని స్థానే కొత్తగా నిర్మించాలి.

– చెట్ల సత్యనారాయణ, ఈదరాడ

నిత్యాన్నదానానికి రూ.60 వేల విరాళం



దాత కుటుంబ సభ్యులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈఓ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన మంగళంపల్లి శ్రీనివాస సుబ్రహ్మణ్య సంగమేశ్వర శర్మ కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.60వేలు అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజుకు అందజేశారు. దాతను సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

60 పనులకు గ్రామసభ ఆమోదం

ఆలమూరు: చొప్పెల్లలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామసభ జరిగింది. సర్పంచ్ దంగేటి చంద్రకళ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఎన్ఆర్‌ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు. సభలో 60 పనులను పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవం తీర్మానం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, గ్రామ కార్యదర్శి ఎం.విజయారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ బి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉద్యోగావకాశాలు

- డీఎస్‌డీఓ హరిశేషు
- కొత్తపేటలో మినీ జాబ్‌మేళా, 10 మందికి ఉద్యోగాలు
- రెండో రౌండ్‌కు 16 మంది ఎంపిక

కొత్తపేట: చదువుకున్న ప్రతి విద్యార్థి మంచి నైపుణ్యాన్ని సాధించి ఉద్యోగావకాశాలు పొందాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎస్‌డీఓ) డీ హరిశేషు సూచించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ మేళా నిర్వహించారు. వీసీపీ సాఫ్ట్ సొల్యూషన్స్, ఎంసీవీ మోటోకార్స్ పీవీటీ లిమిటెడ్, అపోలో ఫార్మసీ తదితర కంపెనీలు పాల్గొనగా 51 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో పది మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కాగా మరో 16 మంది తదుపరి రెండో రౌండ్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డీఎస్డీఓ హరిశేషు మాట్లాడుతూ చదువుకున్న ప్రతి విద్యార్థి ఏదో



కొత్తపేట జాబ్ మేళాలో మాట్లాడుతున్న డీఎస్‌డీఓ హరిశేషు

ఒక రంగానికి సంబంధించి నైపుణ్యాన్ని సాధించాలన్నారు. తద్వారా సమాజానికి ఉపయోగపడే ఉద్యోగాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ పీఓ డాక్టర్ జీ శ్రీనివాసులు, అధ్యాపకులు డాక్టర్ కే అంకమరావు, డాక్టర్ డీసీహెచ్ పాపారావు, వైపీ రాజ్కుమార జిల్లా ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ కే రాజేంద్రప్రసాద్, జ్యోష్న, ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పుపాలెం వంతెన సమస్యను పరిష్కరిస్తాం

నాయకుల తీరుపై ఎమ్మెల్యే దేవ ఆగ్రహం

మలికిపురం: తూర్పుపాలెం వంతెనకు దారేది శీర్షికతో శుక్రవారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనంపై రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ స్పందించారు. శుక్రవారం ప్రభుత్వం నిర్వహించిన పల్లె పండగ గ్రామ సభలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. మండలంలోని గొల్లపాలెంలో జరిగిన పల్లెపండుగ సభలో ఎమ్మెల్యే పాల్గొనగా ఇదే సభకు పక్క గ్రామమైన తూర్పుపాలెం గ్రామ నాయకులు హాజరయ్యారు. ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ తూర్పుపాలెం- పల్లిపాలెం గ్రామాల మధ్య శంకరగుప్తం మేజరు డ్రెన్‌పై నిర్మాణం జరిగిన వంతెన అప్రోచ్ లేక సంపూర్తిగా నిలిచి పోవడాన్ని ఆ నాయకులను ప్రశ్నించారు. ఏడేళ్లు అయినా వంతెన వినియోగంలోనికి రాక పోవడానికి కారణాలను అడిగారు. కూటమి నేతలలో ఐక్యత లోపం వల్ల ఇలా కావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. రూ.4 కోట్లతో వంతెన నిర్మాణం జరగడం అప్రోచ్‌కు స్థల వివాదం కారణంగా నిరుపయోగంగా ఉండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు అంటే



కేశనపల్లి పల్లెపండుగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

వేశా కోలంగా ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్ర, కేంద్ర స్థాయిలలో కూటమి బలంగా ఉన్నప్పటికీ స్థానికంగా అభివృద్ధి పనుల్లే విభేదాలు ఏమిటని ప్రశ్నించారు. వెంటనే వివాదం పరిష్కరించాలని తూర్పుపాలెం నాయకులను ఆదేశించారు. అనంతరం తూర్పుపాలెం శివారులో జరిగిన పల్లెపండుగ గ్రామ సభలో కూడా ఎమ్మెల్యే పాల్గొన్నారు.

25 ఎకరాలలో కొబ్బరి ఆధారిత పరిశ్రమ

రాజోలు దీవిలో 25 ఎకరాలలో కొబ్బరి ఆధారిత పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కేశనపల్లిలో శుక్రవారం జరిగిన పల్లె పండుగ గ్రామ సభలో ఆయన పాల్గొని ప్రశ్నించారు. రైతు కల్వకొలను దొరబాబు కొబ్బరి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరగా ఎమ్మెల్యే స్పందిస్తూ కొబ్బరి తోటల రక్షణకు చర్యలు తీసుకుంటామని, అలాగే కొబ్బరి ఆధారిత పరిశ్రమ ఏర్పాటుకు 25 ఎకరాల స్థలం సేకరించాలని సీఎం కోరినట్టు దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చెప్పినట్టు ఎమ్మెల్యే దేవ తెలిపారు మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యావాణి, సర్పంచులు యెనుముల నాగు, మండపాటి నాగేశ్వరరావు, గుర్లింక సత్తిబాబు, ఎంపీటీసీలు మట్ట అనంతలక్ష్మి, రాపాక సత్యనారాయణ, ఎంపీడీఓ ఎస్ బాలాజీ, తహసీల్దారు టి.శ్రీనివాస్, నాయకులు అడబాల సాయిబాబా, ఆకుల చినవెంకన్నాయుడు, ముప్పర్తి నాని, మేడిచర్ల రాము, తదితరులు పాల్గొన్నారు.

యువజన ఉత్సవాల్లో కొత్తపేట గ్రూపు డాన్స్‌కు ద్వితీయ స్థానం

కొత్తపేట: జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినుల జానపదం గేయ గ్రూపు డాన్స్ ద్వితీయ స్థానంలో నిలిచింది. యువతీ, యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నైపుణ్యతను ప్రదర్శించేందుకు యువజన సంక్షేమ శాఖ - సెట్రాజ్ జిల్లా స్థాయి ఉత్సవాలు అమలాపురం అంబేడ్కర్ భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఆ ఉత్సవాల్లో స్థానిక డిగ్రీ కళాశాల నుంచి అధ్యాపకులు డాక్టర్ కె. సత్యనారాయణ, భవాని ఆధ్వర్యంలో విద్యార్థినులు పాల్గొని జానపద గ్రూపు డాన్స్ ప్రదర్శించారు. ఆ డాన్స్ విశేషంగా ఆకట్టుకుని న్యాయనిర్ణేతల ప్రశంసలందుకుని ద్వితీయ బహుమతి గెలుచుకుంది. విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే పెద్దిరాజు, అధ్యాపకులు అభినందించారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థినుల బృందం

పారిశుధ్యం మెరుగుతో సంపూర్ణ ఆరోగ్యం

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరచడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. వర్షాకాలం సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

ఆపదలో ఆదుకోవడం అభినందనీయం

సఖినేటిపల్లి: ఆపదలో ఉన్న నిరుపేదలను ఆదుకోవడంలో గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని నెడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్, ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పాటి శివకుమార్ అన్నారు. శుక్రవారం సంస్థ ఆరో వార్షికోత్సవం సందర్భంగా గొంది గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై చికిత్స పొందుతున్న విద్యార్థిని బర్రే దుర్గా భవానికి యువశక్తి సేవా సంస్థ రూ.50 వేలు నగదు సమకూర్చింది. ఈ మొత్తాన్ని శివకుమార్, దిండి సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, సంస్థ సభ్యులు కలిపి భవాని ఇంటి వద్ద అందజేశారు. నాయకులు బైరశెట్టి వెంకట రమణ, కడలి రాంబాబు, దొంగ మహేష్, గుబ్బల రాజేష్, కుడుపూడి రాంబాబు, దొంగ పద్మారావు పాల్గొన్నారు. కాగా సంస్థ ద్వారా సమకూర్చిన మరో రూ.50 వేలు నగదును పశ్చిమ గోదావరి జిల్లా లక్ష్మణేశ్వరానికి చెందిన తుల్లూరి గిరిధరరావు దంపతుల కవల పిల్లల ఆపరేషన్ కోసం అందజేసినట్టు సంస్థ అకౌంటెంట్ గుబ్బల శ్రీనివాస్ తెలిపారు.



గొంది గ్రామంలో దుర్గా భవానికి సాయం చేస్తున్న సంస్థ ప్రముఖులు, నాయకులు

నానో ఎరువులపై అవగాహన కల్పించాలి



జొన్నాడ జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న డీఏఓ బోసుబాబు

ఆలమూరు: రైతులు యూరియా, పోటాష్ ఎరువుల స్థానే నానో ఎరువులు వినియోగించేలా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు అన్నారు. జొన్నాడలో ఉన్న రైతు సేవా కేంద్రంలో శుక్రవారం గ్రామ వ్యవసాయ క్షేత్ర సహాయకులతో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆలమూరులోని సబ్ డివిజన్ పరిధిలో ఏడీఏ కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి ఏఓ ఎస్.లక్ష్మీ లావణ్య అధ్యక్షత వహించగా డీఏఓ బోసుబాబు పాల్గొని ప్రసంగించారు. నానో పోటాష్, నానో యూరియా ఎరువుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు నందకిషోర్, మనోహర్, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

ఆలమూరు: జొన్నాడ-మండపేటలో రోడ్డు అధ్వానంగా ఉండడంతో శుక్రవారం ఆలమూరు వద్ద ఆటో గోతులో కూరుకుపోయింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానిక సబ్‌స్టేషన్ సమీపంలో కూరుకుపోయిన ఆటో వల్ల వెనుక వచ్చిన వాహనాలు ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



బురదలో కూరుకుపోయిన ఆటో

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కె.జె.ప్రకాష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 19వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకూ గ్రామ సభలు నిర్వహించనున్నామన్నారు. ఈనెల 19న కలవచర్ల, 21న గుమ్మిలేరు, 22న మడికి, 23న మోదుకూరు, 24న నవాబుపేట, 25న పెదపళ్ల, 28న పెనికేరు, 29న బడుగువానిలంక, 30న ఆలమూరు, నంబర్ ఒకటిన చింతలూరు, 2న చొప్పెల్ల, 3న నర్శిపూడి, 5న సంధిపూడి గ్రామాల్లో ఈ గ్రామ రెవెన్యూ సభలు నిర్వహించనున్నామన్నారు.

అంబాజీపేట: భూ సమస్యల పరిష్కారానికి శనివారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రీ సర్వే జరిగిన గ్రామల్లో గ్రామ సభలు ఏర్పాటు చేయనున్నామన్నారు. మండలంలో 19న ముక్కామల, 21న పసుపల్లి, 22న వక్కలంక, 23న మొసలపల్లి గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు. రీ సర్వేలో భూమి విషయంలో అభ్యంతరాలు , తేడాలు ఉంటే సభలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ సభలను స్థానిక గ్రామ సచివాలయాల వద్ద జరుగుతాయని తెలిపారు.

గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం

అయినవిల్లి: గ్రామాల్లో రోడ్లు ఇతర మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని 10 గ్రామాలలో సుమారు రూ.1.46 కోట్లతో చేపట్టబోయే రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వెలువలపల్లి, అయినవిల్లి గ్రామంలో స్థానిక సమస్యలను ఆయన స్వయంగా వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అయినవిల్లి గ్రామ సర్పంచ్ కాకర శ్రీనివాస్, వైఎస్ ఎంపీపీ బయ్యా చినబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


నయన మనోహరం.. బేతాళ స్వామి ఉత్సవం

- స్వామివారిని దర్శించుకున్న భక్తులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అంబాజీపేట: విజయ బేతాళస్వామి ఉత్సవాలు నయన మనోహరంగా సాగాయి. అంబాజీపేటలో 13 పాలాలకు చెందిన వివిధ రకాల గ్రామ మూర్తులు పురవీధుల్లో ఊరేగుతూ స్థానిక సెంటరులో కొలువుదీరి భక్తులను కనువిందు చేశాయి. అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బేతాళస్వామి సంబరాలు శుక్రవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ అట్టహాసంగా జరిగాయి. శ్రీనివాసనగర్‌లో ఉన్న విజయ బేతాల స్వామి ఆలయం వద్ద నుంచి ఈ సంబరాలు ప్రారంభమయ్యాయి. 13 పాలాలా నిర్వాహకులు దేవతామూర్తులను రంగు రంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించిన వాహనాలపై పెట్టి మేళతాళాలతో ఊరేగించారు. వాహనాల ముందు చెడీతాలింఖానా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువకులు చేసిన విన్యాసాలు గగుర్పాటుకు గురిచేశాయి. గరగ నృత్యాలు, శక్తి వేషాలు ఆకట్టుకున్నాయి. స్థానిక సెంటర్‌లో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. తెల్లవార్లు జరిగే ఈ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా కొత్తపేట డీఎస్పీ గోవిందరావు ఆధ్వర్యంలో పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు పర్యవేక్షణలో ఎస్సై కె.చిరంజీవి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బేతాళ స్వామిని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, చెల్లుబోయిన శ్రీనివాసరావు తదితరులు దర్శించుకున్నారు.



విద్యుద్దీపాలంకరణలో గంగలకుర్రు మలుపులో విజయ గణపతి



వాహనంపై కొలువుతీరిన శ్రీ కృష్ణుడు



శ్రీనివాసనగర్‌లో చెడీతాలింఖానా చేస్తున్న భక్తులు



బేతాళ స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి